batukammanews.com
TEL/2019/78873
# బతుకమ్మ
తాజా వార్తల సద్దిమూట
11 ఆగస్టు 2026
మంగళవారం

## శివగంగ కొండల్లో టెక్కీ అదృశ్యం

### ముమ్మరంగా గాలింపు..

వెబ్ డెస్క్, బతుకమ్మ :బెంగళూరు శివార్లలోని శివగంగ కొండలకు ట్రెక్కింగ్‌కు వెళ్లిన ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి అదృశ్యమయ్యాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన 31 ఏళ్ల అద్వైత్ ఉపాధ్యాయ్ బెంగళూరులోని బేగూరు ప్రాంతంలో నివాసం ఉంటూ వైట్‌ఫీల్డ్ లోని ఓ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నాడు.



02

# రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలి

### విస్తారంగా వర్షాలు కురవాలని మహా వరుణయాగం

### పూర్ణాహుతి సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి దంపతులు

నాగార్జునసాగర్, బతుకమ్మ :రాష్ట్రం సస్య శ్యామలంగా, సుభిక్షంగా, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి, నదులు, ప్రాజెక్టులు, చెరువులు జలకళతో నిండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం సోమవారం నిర్వహించిన మహా వరుణయాగం శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ వద్ద కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ యాగంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని, వేదపండితులు, రుత్వికుల మార్గదర్శకత్వంలో యాగక్రతువులు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమగుండాలను ఏర్పాటు చేసి వరుణదేవుని అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తూ వైదిక విధానంలో హోమక్రతువులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. దివ్యమైన ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన వరుణయాగంలో కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలన్న సంకల్పంతో ఈ యాగాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని, కృష్ణా, గోదావరి నదులు నిండుగా ప్రవహించాలని, శ్రీశైలం, నాగార్జునసాగర్‌తో పాటు అన్ని ప్రాజెక్టులు నిండాలని, రాష్ట్రంలోని ప్రతి చెరువు, ప్రతి కుంట జలకళతో కళకళలాడాలని, భూగర్భ జలాలు పెరగాలని, పంటలు పుష్కలంగా పండాలని, రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతిలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ యాగాలు, యజ్ఞాలు, పూజలు నిర్వహించడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయమని ప్రభుత్వం పేర్కొంది. ఒకవైపు శాస్త్రీయ అంచనాలు, ప్రణాళికల ఆధారంగా ప్రభుత్వం ముందుకు సాగుతూనే.. వర్షం, వ్యవసాయం, ప్రకృతి, మానవ జీవితం మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని ప్రతిబింబించే సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రకృతి అనుగ్రహం కోసం వరుణదేవుడిని ప్రార్థించినట్లు తెలిపింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం మహా వరుణయాగాన్ని నిర్వహించింది.



02

## మత్స్యకారులకు తెలంగాణ ప్రభుత్వ భరోసా

### 4.21 లక్షల మందికి గ్రూప్ ప్రమాద బీమా

### క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



02

హైదరాబాద్, బతుకమ్మ :రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం, సామాజిక భద్రతకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని, 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్య కారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం (జీఏఐఎస్) అమలు చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యానికి గురయ్యే మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో గ్రూప్ ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. 2026-27 సంవత్సరంలో 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల 4,21,767 మంది నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని మంత్రి వెల్లడించారు. ఒక్కో లబ్ధిదారునికి రూ.79.96 చొప్పున బీమా ప్రీమియం ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ప్రీమియం భరిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21,34,79,673 చెల్లించనుందని వివరించారు. దీంతో అర్హులైన మత్స్యకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు. ఈ గ్రూప్ ప్రమాద బీమా పథకం కింద ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.5 లక్షల వరకు బీమా పరిహారం అందు తుంది. శాశ్వత సంపూర్ణ వైకల్యానికి కూడా రూ.5 లక్షలు, శాశ్వత పాక్షిక వైకల్యానికి రూ.2.50 లక్షల వరకు బీమా రక్షణ లభిస్తుంది. అలాగే ప్రమాదవశాత్తు ఆసుపత్రిలో చికిత్స పొందిన సందర్భంలో గరిష్ఠంగా రూ.25 వేల వరకు వైద్య సహాయం అందించనున్నారు. 2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చే పాలసీ కాలంలో అర్హులైన ప్రతి నమోదిత మత్స్యకారుడికి నిరంతర బీమా రక్షణ అందేలా మత్స్యశాఖ అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ప్రమాద సమయంలో మత్స్యకారుల కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు, వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.

## అమెరికాలో ప్రియురాలి హత్య కేసు

### జర్మనీలో భారతీయ యువకుడి అరెస్ట్

వెబ్ డెస్క్, బతుకమ్మ :అమెరికాలో 19 ఏళ్ల ప్రియురాలిని హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 20 ఏళ్ల భారతీయ యువకుడిని జర్మనీ పోలీసులు అరెస్ట్ చేశారు. అరిజోనా రాష్ట్రంలోని టక్సన్‌లో జరిగిన ఈ హత్య అనంతరం నిందితుడు అమెరికా నుంచి జర్మనీకి పారిపోయినట్లు అధికారులు తెలిపారు.



02

## హత్యకు దారితీసిన ఈజీ మనీ ఆశ

### బెట్టింగ్‌తో అప్పుల్లో కూరుకుపోయిన యువకుడి ఘాతుకం

వెబ్‌డెస్క్, బతుకమ్మ :ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన ఓ యువకుడు ఈజీ మనీ కోసం దారుణానికి పాల్పడ్డా డు. బెట్టింగ్‌లు, మద్యపానానికి అలవాటుపడి ఆర్థిక ఇబ్బం దుల్లో కూరుకుపోయిన అతడు.. చివరకు ఓ వృద్ధురాలిని హత్య చేసి బంగారు ఆభరణాలను దోచుకున్న ఘటన ఖమ్మం జిల్లాలో కలకలం రేపింది. ఒకప్పుడు బెట్టింగ్ అంటే రహస్యంగా జరిగే వ్యవహారంగా ఉండేది. అయితే స్మార్ట్ ఫోన్లు, బెట్టింగ్ యాప్‌ల విస్తృతితో పరిస్థితి మారిపో యింది. కష్టపడకుండా త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో మొదట సరదాగా బెట్టింగ్ ప్రారంభించే యువత.. క్రమంగా దానికి బానిసలుగా మారుతున్నారు.



02

# రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలి

ఈ పవిత్ర వరుణయాగ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, పి. సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి కె. జానారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువులతో నాగార్జునసాగర్ పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.



# అమెరికాలో ప్రియురాలి హత్య కేసు

ప్రస్తుతం అతడిని అమెరికాకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది. టక్సన్‌లోని ఓ అపార్ట్ మెంట్‌లో 19 ఏళ్ల కళాశాల విద్యార్థిని జులిస్సా రూబీ సలాజర్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అపార్ట్ మెంట్‌కు వెళ్లి పరిశీలించగా, ఆమె అపస్మారక స్థితిలో కనిపించింది. వైద్య సిబ్బంది పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె శరీరంపై తీవ్ర గాయాల గుర్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పోలీసుల ఆరోపణల ప్రకారం.. సలాజర్‌ను గొంతు నులిమి హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఆమె ప్రియుడు వరుణ్ బట్చిగారిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. దర్యాప్తులో మృతురాలికి చెందిన ఫోన్, క్రెడిట్ కార్డులను వరుణ్ తీసుకున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిపారు. హత్య అనంతరం వరుణ్ టక్సన్ నుంచి జర్మనీలోని బెర్లిన్‌కు వెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. అక్కడి నుంచి భారత్‌కు వెళ్లేందుకు అతడు ప్రయత్నించినట్లు అమెరికా అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో వరుణ్‌పై అమెరికా అధికారులు ఫస్ట్ - డిగ్రీ హత్య, కిడ్నాప్ ఆరోపణలతో అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. అనంతరం జర్మనీ అధికారులతో సమన్వయం చేసుకుని అతడిని బెర్లిన్‌లో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వరుణ్ జర్మన్ పోలీసుల అదుపులో ఉన్నాడు. అతడిని అరిజోనా రాష్ట్రానికి అప్పగించేందుకు అమెరికా, జర్మనీ అధికారులు తదుపరి న్యాయపరమైన ప్రక్రియను కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు దర్యాప్తు పూర్తయ్యే కొద్దీ వెల్లడయ్యే అవకాశం ఉంది.

# మత్స్యకారులకు తెలంగాణ ప్రభుత్వ భరోసా

మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో గ్రూప్ ప్రమాద బీమా పథకం కీలకమైనదని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నమోదిత మత్స్యకారులు, వారి కుటుంబాలకు సమగ్ర సామాజిక భద్రత, ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వాకిటి శ్రీహరి తెలిపారు.

# హత్యకు దారితీసిన ఈజీ మనీ ఆశ

ఆర్థిక నష్టాలు, అప్పుల ఒత్తిడి పెరగడంతో కొందరు నేరాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా పిండిప్రోలు గ్రామానికి చెందిన ఐతనబోయిన ప్రశాంత్ (26) చికెన్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో పాటు మద్యపానానికి అలవాటుపడిన ప్రశాంత్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాడు. ఈ క్రమంలో తన షాప్ సమీపంలో నివసించే సుగుణ అనే వృద్ధురాలి బంగారు ఆభరణాలపై కన్నేశాడు. జులై 17 అర్ధరాత్రి సమయంలో సుగుణ ఇంటికి వెళ్లిన ప్రశాంత్.. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకునేందుకు ప్రయత్నించాడు. అయితే సుగుణ గట్టిగా ప్రతిఘటించడంతో.. వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డుతో ఆమెపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు చైన్‌తో పాటు నల్లపూసల చైన్‌కు సంబంధించిన బంగారు బిళ్లలను తీసుకుని ప్రశాంత్ అక్కడి నుంచి పరారయ్యాడు. హత్య అనంతరం దొంగిలించిన బంగారు చైన్‌ను ప్రశాంత్ తన బావమరిది, మహబూబాబాద్ జిల్లా మర్రిపెడ మండలం బాలినిధర్మారం గ్రామానికి చెందిన సరగండ్ల మహేష్ (20) కు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. మహేష్ ఆ బంగారు చైన్‌ను తన పేరుతో ఖమ్మంలోని ఓ బ్యాంకులో కుదువపెట్టి రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాడు. ఈ హత్య, దోపిడీ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆగస్టు 9న ఉదయం తిరుమలాయపాలెం రోడ్డులో ప్రధాన నిందితుడు ప్రశాంత్‌తో పాటు అతనికి సహకరించిన సరగండ్ల మహేష్‌ను అరెస్ట్ చేశారు. బెట్టింగ్ వ్యసనం కారణంగా ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న యువకుడు.. ఈజీ మనీ కోసం హత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రభావం, యువతలో పెరుగుతున్న వ్యసనం పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

# శివగంగ కొండల్లో టెక్కీ అదృశ్యం

శుక్రవారం ఉదయం శివగంగ కొండలకు ట్రెక్కింగ్‌కు వెళ్తున్నట్లు తన నిశ్చితార్థురాలికి సమాచారం ఇచ్చిన అద్వైత్.. ద్విచక్రవాహనాన్ని అద్దెకు తీసుకుని బయలుదేరాడు. ఉదయం సుమారు 6:30 గంటలకు శివగంగ కొండ పాద ప్రాంతానికి చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వాహనాన్ని అక్కడే పార్క్ చేసి ఒంటరిగా ట్రెక్కింగ్‌కు వెళ్లినట్లు తెలిపారు. అయితే కొండపైకి వెళ్లిన కొద్దిసేపటికే అద్వైత్ మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో అతడి ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కడుగోడి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కొండ పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా.. అద్వైత్ కొండ ఎక్కుతున్న దృశ్యాలు కనిపించినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆ తర్వాత అతడు తిరిగి వచ్చినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. అద్వైత్ ఒంటరిగా ట్రెక్కింగ్‌కు వెళ్లిన నేపథ్యంలో అతడిని ఎవరైనా కిడ్నాప్ చేసి ఉండొచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పోలీసులు ఈ అనుమానంతో పాటు ఇతర అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు, రెస్క్యూ సిబ్బంది శివగంగ కొండలు, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. అద్వైత్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించారు.

## నిద్రలేమి సమస్య ఉన్నవారు పాటించాల్సిన చిట్కాలు ఇవే..

# హాయిగా నిద్రించవచ్చు..



ఆరోగ్యంగా ఉండడానికి తగినంత నిద్ర ఎంతో అవసరం. అయితే వృత్తిపరమైన ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు, శారీరక శ్రమ తక్కువగా ఉండే జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వంటి కారణాలతో చాలామందిలో నిద్ర విధానం దెబ్బతింటోంది. సాధారణంగా రోజుకు 8 గంటల నిద్ర ఆరోగ్యానికి మంచిదిగా వైద్యులు చెబుతుంటారు. కానీ ప్రస్తుత జీవనశైలిలో ప్రతిరోజూ 8 గంటలు నిద్రపోవడం చాలామందికి సాధ్యం కావడం లేదు. తగినంత నిద్ర లేకపోవడం లేదా నిద్ర సమయాల్లో తరచూ మార్పులు రావడం వల్ల స్వల్పకాలికంగానే కాకుండా దీర్ఘకాలంలోనూ ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. చిరాకు, ఏకాగ్రత తగ్గడం, మెదడు పనితీరుపై ప్రభావం, బరువు పెరగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో డిప్రెషన్‌కు కూడా దారితీస్తోంది. రాత్రి పడుకునే ముందు ఎక్కువగా తినడం లేదా పడుకునే సమయానికి చాలా దగ్గరగా భోజనం చేయడం వల్ల గుండెల్లో మంట, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. దీంతో నిద్రపోవడం కష్టంగా మారుతుంది. అందువల్ల రాత్రివేళ పడుకునే ముందు అతిగా తినడం, మధ్యలో అనవసరంగా స్నాక్స్ తీసుకోవడం వంటివి తగ్గించుకోవాలి.

### క్రమబద్ధమైన అలవాటు ముఖ్యం..

ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, మేల్కొనడం వంటి క్రమబద్ధమైన నిద్ర అలవాటును పాటించడం కూడా ముఖ్యమే. వారాంతాల్లో కూడా నిద్ర సమయాన్ని ఎక్కువగా మార్చకుండా చూసుకోవడం వల్ల శరీరంలోని జీవ గడియారం క్రమబద్ధంగా పనిచేయడానికి సహాయపడుతుంది. శరీరానికి ఒక సహజమైన జీవ గడియారం ఉంటుంది. అది సక్రమంగా పనిచేస్తే రాత్రి నిద్రపోవడం, నిద్రను కొనసాగించడం సులభమవుతుంది. శారీరక శ్రమ లేకుండా ఎక్కువసేపు కూర్చునే జీవనశైలి కూడా నిద్రపై ప్రభావం చూపిస్తుంది. ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామం చేయడం వల్ల రాత్రివేళ మెరుగైన నిద్ర పొందేందుకు సహాయపడుతుంది. వ్యాయామం తీవ్రంగా ఉండాల్సిన అవసరం లేదు, తేలికపాటి శారీరక కార్యకలాపాలు కూడా నిద్రకు ఉపయోగపడతాయి. రాత్రివేళ మద్యం, సిగరెట్లు, కెఫీన్ వంటి వాటిని తీసుకోవడం నిద్రకు అంతరాయం కలిగిస్తాయి. అలాగే పడుకునే సమయానికి దగ్గరగా ఎక్కువగా లేదా మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం కూడా నిద్రపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. కాబట్టి రాత్రి భోజనాన్ని తేలికగా, పడుకునే సమయానికి కొంత ముందుగానే ముగించడం మంచిది.

### పాలలో ఇవి కలిపి తాగితే..

పడకపై నిద్రపోవడం తప్ప ఇతర పనులు చేయడం కూడా నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. పుస్తకం చదవడం, మొబైల్ స్క్రీన్ చూడటం లేదా ఇతర పనులు చేయడం వంటి అలవాట్లు పడకను నిద్ర కోసం ఉపయోగించే ప్రదేశంగా మెదడు గుర్తించకుండా చేస్తుంది. అందువల్ల ఇలాంటి పనులు చేయాల్సి వస్తే మరో గదిలో పూర్తి చేసి, నిద్రపోయే సమయంలో మాత్రమే పడకపైకి వెళ్లడం మంచిది. నిద్ర సమస్యలు లేదా స్వల్ప స్థాయి నిద్రలేమి ఉన్నవారు ఆయుర్వేదంలో సూచించే కొన్ని ఆహార పద్ధతులను కూడా ప్రయత్నించవచ్చు. పడుకునే ముందు గోరువెచ్చని పాలలో చిటికెడు జాజికాయ, కొద్దిగా యాలకులు, మెత్తగా చేసిన బాదం కలిపి తీసుకోవడం మేలు చేస్తుంది. అలాగే పాలు, నీరు, తాజా వెల్లుల్లి కలిపి మరిగించి తయారు చేసిన వెల్లుల్లి పాలను తీసుకోవచ్చు. ఒక కప్పు పాలకు పావు కప్పు నీరు, ఒక వెల్లుల్లి రెబ్బను కలిపి మరిగించి, ద్రవం ఒక కప్పు పరిమాణంలో మిగిలిన తర్వాత తీసుకోవాలి.

### చెర్రీలు..

చెర్రీలను క్రమం తప్పకుండా తీసుకోవడం కూడా మంచి నిద్రకు సహాయపడుతుంది. అలాగే ఒక కప్పు తాజా టమాటా రసంలో రెండు టీస్పూన్ల చక్కెర, చిటికెడు జాజికాయ కలిపి సాయంత్రం 4 నుంచి 5 గంటల సమయంలో తీసుకుని, రాత్రి భోజనాన్ని ముందుగానే ముగించాలి. నిద్రను మెరుగుపరచుకోవడానికి బ్రాహ్మి, అశ్వగంధ, శంఖపుష్పి, జటమాంసి వంటి కొన్ని మూలికలను కూడా ఉపయోగించవచ్చు. అయితే నిద్ర సమస్యలు తరచూ కొనసాగుతున్నప్పుడు లేదా ఎక్కువకాలంగా నిద్రలేమితో బాధపడుతున్నప్పుడు స్వయంగా మూలికలు లేదా ఇతర చికిత్సలు ప్రారంభించకుండా నిపుణులను సంప్రదించడం మంచిది.

## ఐరన్ ట్యాబ్లెట్లను రోజూ వేసుకుంటున్నారా..

# అయితే ఈ విషయాలను తెలుసుకోవాల్సిందే..



శరీర ఆరోగ్యానికి ఐరన్ ఎంతో అవసరం. ఐరన్ లోపం వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. లోపం ఉన్నప్పుడు వైద్యులు ఐరన్ సప్లిమెంట్లను సూచిస్తారు. అయితే అవసరానికి మించి ఐరన్ సప్లిమెంట్లను తీసుకోవడం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే వైద్యుల సూచన మేరకు సరైన మోతాదులోనే వీటిని తీసుకోవడం ముఖ్యం. ఐరన్ సప్లిమెంట్లను అధికంగా తీసుకున్నప్పుడు కొన్ని సాధారణ దుష్ప్రభావాలు కనిపిస్తాయి. ముఖ్యంగా దంతాలపై మరకలు పడడం, జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు, వికారం, వాంతులు వంటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. లిక్విడ్ రూపంలో ఉండే ఐరన్ సప్లిమెంట్లను నేరుగా తీసుకోవడం వల్ల దంతాలపై మరకలు పడే అవకాశం ఉంటుంది. అందువల్ల వాటిని నీరు లేదా పండ్ల రసంలో కలిపి, స్ట్రా ద్వారా తీసుకోవడం వల్ల దంతాలతో నేరుగా సంబంధం ఉండడాన్ని తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

### జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం..

ఐరన్ సప్లిమెంట్లు కొందరిలో పొట్టలో అసౌకర్యం, మలబద్ధకం, విరేచనాలు లేదా కడుపు నొప్పి వంటి జీర్ణ సంబంధిత సమస్యలకు కారణమవుతాయి. ఇలాంటి సమస్యలు ఎదురైతే ఆహారంతోపాటు లేదా భోజనానికి ముందు, తర్వాత సప్లిమెంట్లను తీసుకోవడం వల్ల కొంత ఉపశమనం లభిస్తుంది. ఐరన్ ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల వికారం, వాంతులు, నోటిలో లోహం రుచి వంటి సమస్యలు వస్తాయి. మోతాదును తగ్గించడం వల్ల ఈ సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది. అయితే సప్లిమెంట్ మోతాదును స్వయంగా మార్చకుండా వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. శరీరంలో ఐరన్ అధికంగా చేరితే రక్త ప్రసరణ వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఫలితంగా రక్తపోటు తగ్గడం, నాడి బలహీనంగా లేదా వేగంగా కొట్టుకోవడం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు కనిపిస్తాయి.

### చర్మం రంగుల్లో మార్పులు..

ఐరన్ ను అధిక మోతాదులో తీసుకోవడం వల్ల చర్మం, పెదవులు లేదా వేళ్ల చివర్ల రంగులో మార్పులు కనిపిస్తాయి. చర్మం రంగు కోల్పోవడం లేదా వేళ్ల చివర్లలో నీలిరంగు ఛాయ కనిపించడం ఐరన్ అధిక మోతాదుకు సంకేతంగా ఉంటుంది. పిల్లల విషయంలో ఐరన్ అధిక మోతాదు మరింత ప్రమాదకరంగా ఉంటుంది. అధికంగా ఐరన్ ను తీసుకోవడం వల్ల శరీరంలో జింక్ శోషణకు ఆటంకం కలుగుతుంది. జింక్ లోపం పిల్లల్లో ఎదుగుదల సమస్యలు, జుట్టు రాలడం, ఆకలి తగ్గడం, చర్మ సంబంధిత సమస్యలు, విరేచనాలు వంటి ఇబ్బందులకు దారితీస్తుంది. అందువల్ల ఐరన్ సప్లిమెంట్లు తీసుకునేవారు జింక్ సమృద్ధిగా ఉండే ఆహారాన్ని కూడా తీసుకోవాలి. ఐరన్ సప్లిమెంట్లు తీసుకున్నప్పుడు మలం నలుపు లేదా బూడిద రంగులోకి మారడం కొంతవరకు సాధారణమే. అయితే మలం తారు మాదిరిగా నల్లగా కనిపించడం, అందులో రక్తపు చారలు కనిపించడం, కడుపులో తీవ్రమైన నొప్పి లేదా పుండ్ల వంటి లక్షణాలు ఉంటే అంతర్గత రక్తస్రావానికి సంకేతం అవుతుంది. అలాంటి పరిస్థితుల్లో వైద్యులను సంప్రదించడం అవసరం.

# కార్మిక వర్గాన్ని కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మారుస్తుంది

## రైతు, కార్మిక సంఘాలు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : మోదీ ప్రభుత్వం భారత రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీస్తూ, కార్మిక వర్గాన్ని కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చే విధానాలను అవలంబిస్తోందని రైతు, కార్మిక సంఘాలు ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వివిధ రైతు, కార్మిక సంఘాలు సోమవారం ఆందోళన నిర్వహించాయి. రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుంచి ధర్నా చౌక్ వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. అనంతరం ధర్నా చౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. ఆందోళన నేపథ్యంలో పోలీసులు పలువురు నాయకులను అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. రమేష్ బాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వై. ఓమయ్య, టీయుసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు బి. భూమయ్య, ఏఐపికెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. దేవారం, ఎఐకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. భూమయ్య, ఎఐఎడబ్ల్యూయు రాష్ట్ర కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, ఏఐకెఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, జిల్లా అధ్యక్షులు వి. భూమయ్య తదితరులు మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల రంగాలను నిర్వీర్యం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశవ్యాప్తంగా రైతు, కార్మిక సంఘాలు జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని నాయకులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనాలను అమలు చేయాలని, పంటలకు




కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యా స్, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే దేశవ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలను సంఘటితం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రైతు, కార్మిక సంఘాల నాయకులు వెంకన్న, రాజేశ్వర్, సురేష్, సాయరెడ్డి, హన్మండ్లు, శివకుమార్, మల్లికార్జున్, సత్యక్క, కిషన్ కిరణ్, ఒడ్డెన్న, నసీర్, గోవర్ధన్, భాను నర్సయ్య, సాయిలు, అలీ పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుల స్మరణకే 'హర్ ఘర్ తిరంగా'

### కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

కామారెడ్డి, బతుకమ్మ :స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తిని చాటుకునేందుకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా సోమవారం కామారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాటిపల్లి వెంకట రమణారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, ఆ మహనీయుల సేవలను నేటి తరానికి గుర్తు చేయడమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దేశభక్తి భావాన్ని ప్రతి ఒక్కరిలో పెంపొందించేందుకు ప్రతి కుటుంబం తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ఆయన కోరారు. జాతీయ జెండా రెపరెపలాడేలా చేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి సూచించారు.



# కాళేశ్వరం మోటార్లు వెంటనే ఆన్ చేయాలి

### ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ

హైదరాబాద్, బతుకమ్మ :కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను సకాలంలో నింపి రైతులకు సాగునీరు అందించేందుకు మోటార్లను వెంటనే ఆన్ చేసి నీటి పంపింగ్ ప్రారంభించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకుని నీటి పంపింగ్ చేపట్టాలని ఆయన లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వానాకాలం సాగు సీజన్‌లో ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, మరోవైపు ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. పంటల సాగు ముందుకు సాగేందుకు అవసరమైన సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి మోటార్లను ఆన్ చేసి నీటిని పంపింగ్ చేయాలని ఆయన కోరారు. మిడ్ మానేరు పూర్తి నీటి సామర్థ్యం 27 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 22 టీఎంసీల నీటి లభ్యత ఉందని లేఖలో పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరిలో వరద నీటి లభ్యత కూడా ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను వెంటనే ప్రారంభించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అన్నపూర్ణ (అంతగిరి), రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, నృసింహ (బస్వాపూర్) తదితర రిజర్వాయర్లను నింపడంతో పాటు వాటి పరిధిలోని చెరువులు,



చెక్‌డ్యామ్‌లను కూడా నింపాలని కోరారు. ఈ రిజర్వాయర్ల ద్వారా సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉన్నందున, రైతుల ప్రయోజనాల కోసం ఎలాంటి జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ (ఎల్‌ఎండీ) పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 6.9 టీఎంసీల నీటి లభ్యత ఉందని హరీశ్ రావు తెలిపారు. మిడ్ మానేరు నుంచి ఎల్‌ఎండీకి నీటిని తరలించి, ఎస్‌ఆర్‌ఎస్‌పీ స్టేజ్-2 పరిధిలోని అవసరమైన ఆయకట్టుకు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. గత యాసంగి సీజన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టులోని పై రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో సుమారు 4 లక్షల ఎకరాల్లో సాగు జరిగిందని హరీశ్ రావు గుర్తు చేశారు. ఈ వానాకాలంతో పాటు వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్లను నింపాలని కోరారు. రిజర్వాయర్లకు అనుసంధానంగా ఉన్న కాలువలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లను కూడా నీటితో నింపి రైతుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించాలని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. రైతుల సాగు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాజకీయాలకు అతీతంగా తక్షణమే నీటి పంపింగ్ ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సోమవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ సీళ్లను, పోలీసు బందోబస్తును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ తదితరులు ఉన్నారు.



# స్వాతంత్ర సమరయోధుల పోరాట స్ఫూర్తితో "హర్ ఘర్ తిరంగా"

### ఇంటిపై జెండా ఆవిష్కరించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :స్వాతంత్ర సమరయోధుల పోరాట స్ఫూర్తితో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మిర్చి కంపౌండ్ లో గల తమ ఇంటిపై జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం మాదిరిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు

# అపరిచితులను నమ్మి మోసపోవద్దు

### ఏఎస్ఐ నర్సింగ్ రావు



రాజంపేట, బతుకమ్మ :ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా వేదికలను జాగ్రత్తగా వినియోగించాలని, అపరిచితులను నమ్మి మోసపో వద్దని ఏఎస్ఐ నర్సింగరావు సూచించారు. రాజంపేట కస్తూరిబా బాలికల విద్యాలయంలో సోమవారం ప్రేమలు - మోసాలు, మైనర్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలు, మైనర్లపై జరుగుతున్న నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర సామాజిక అంశాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, రాజంపేట సబ్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు సూచనలతో, ఏఎస్ఐ నర్సింగరావు ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థినులకు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు, మాదక ద్రవ్యాల సంబంధిత సమాచారానికి 1908 టోల్‌ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. మహిళలు, బాలికల భద్రత కోసం షీ టీమ్ నంబర్ 8712686094కు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100/112కు కాల్ చేయాలని అవగాహన కల్పించారు. విద్యార్థినులు మంచి లక్ష్యంతో చదువుపై దృష్టి సారించాలని, చిన్నపాటి పొరపాట్లు కూడా భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇచ్చే సూచనలు పాటిస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ యు.యు. శేషరావు, పోలీస్ కానిస్టేబుళ్లు ప్రభాకర్, సాయిలు మాటలు, పాటల ద్వారా విద్యార్థినులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యురాలు డబ్ల్యూపీసీ సౌజన్య, బ్లూ కోట్స్ పీసీ స్వామిగౌడ్, హెచ్‌జీ పూల్‌సింగ్‌తో పాటు అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# పిడిఎస్ బియ్యం తరలిస్తున్న వాహనం సీజ్

నందిపేట్, బతుకమ్మ :నందిపేట్ మండల కేంద్రంలో అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని ఆంధ్రానగర్ గ్రామంలో పోలీసులు బొలెరో పికప్ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. తనిఖీల్లో వాహనంలో 57 బ్యాగుల్లో సుమారు 31 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బియ్యానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు, పత్రాలు వాహనంలో ఉన్న వ్యక్తుల వద్ద లేకపోవడంతో బియ్యంతో పాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వాహన డ్రైవర్ ఖలీమ్, వాహనం యజమాని మాక్లూర్‌కు చెందిన ఇమ్రాన్ పై కేసు నమోదు చేసినట్లు నందిపేట్ ఎస్ఐ వినయ్ తెలిపారు. పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.



# శ్రీ చైతన్య స్కూల్లో విద్యార్థిపై దాడి

## 12 మంది తోటి విద్యార్థులపై ఆరోపణలు



మేడ్చల్, బతుకమ్మ :దమ్మాయిగూడలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థిపై తోటి విద్యార్థులు దారుణంగా దాడి చేసిన ఘటన కలకలం రేపుతోంది. కామారెడ్డికి చెందిన అభిషేక్ అనే విద్యార్థిపై హాస్టల్‌లో రాత్రి సమయంలో 12 మంది విద్యార్థులు కర్రలు, ప్లేట్లతో దాడి చేసి, బూట్లతో ముఖంపై తొక్కినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో అభిషేక్ తీవ్రంగా గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన అనంతరం తమ కుమారుడు మెట్లపై నుంచి కిందపడిపోయాడంటూ పాఠశాల యాజమాన్యం ఫోన్ చేసి సమాచారం ఇచ్చిందని వారు వెల్లడించారు. వెంటనే పాఠశాలకు చేరుకున్న తల్లిదండ్రులు అభిషేక్‌ను ఇంటికి తీసుకువచ్చారు. అయితే అతని పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రస్తు తం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. అయితే తనపై ర్యా గింగ్ పేరుతో సీనియర్ విద్యార్థులు దాడి చేసినట్లు అభిషేక్ తల్లిదం డ్రులకు వెల్లడించినట్లు సమాచారం. దీంతో వారు పోలీసులను ఆశ్ర యించి ఫిర్యాదు చేశారు. తమ కుమారుడిపై దాడికి పాల్పడిన విద్యా ర్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఘటనను బయటకు రాకుండా దాచిపెట్టేందుకు ప్రయత్నించిన పాఠశాల యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని వారు కోరుతు న్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. దాడికి గల పూర్తి కారణాలు, ఘటనలో పాల్గొన్న విద్యార్థుల పాత్ర, పాఠశాల యాజమాన్యం వ్యవహరించిన తీరుపై విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# కౌలాస్ నాలా ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద నీటి ప్రవాహం



జుక్కల్, బతుకమ్మ :జుక్కల్ మండలంలోని సావర్‌గాం గ్రామంలో ఉన్న కౌలాస్ నాలా ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 458.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 457.35 మీటర్ల నీటిమట్టం ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 265 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు ఏఈ రవిశంకర్ పేర్కొన్నారు. ప్రాజెక్టు నీటిమట్టం, ఇన్‌ఫ్లో పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

# ఏటీఎంలో చోరీకి యత్నం

## పోలీసులకు చిక్కిన నేరస్తుడు



లింగంపేట, బతుకమ్మ :లింగంపేట్ మండల కేంద్రంలోని ఎస్బీఐ ఏటీఎంలో సోమవారం తెల్లవారు జామున చోరీకి యత్నించిన నేరస్తుడు పోలీసులకు చిక్కిన సంఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రంలో జరిగింది. స్థానిక ఎస్సై దీపక్ కుమార్ కథనం ప్రకారం గాంధారి మండల కేంద్రానికి చెందిన శశికుమార్ అనే వ్యక్తి లింగంపేట మండలం ఒంటర్ పల్లి గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. లింగంపల్లి గ్రామ శివారులో గల వాటర్ ప్లాంట్ లో ఆటో డ్రైవర్ గా పని చేస్తున్నట్లు వెల్లడించారు. శశికుమార్ సోమవారం తెల్లవారు జామున ఒంటిగంట సమయంలో లింగంపేటలోని ఎస్బీఐ ఏటీఎం కేంద్రం వద్దకు ఆటోలో వచ్చాడు. ఆటోను ఇంటి పక్కన సందులో ఉంచి ఏటీఎంలోకి చొర బడ్డాడు. ఏటీఎంలోని నగదును దోచుకునేందుకు ఏటీఎం మెషిన్ను ధ్వంసం చేస్తుండగా వచ్చిన శబ్దంతో ఇంటి యజమాని పంబల్ల శ్రీనివాస్ నిద్రలో నుంచి లేచి స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఎస్ఐ తన సిబ్బందితో ఏటీఎం వద్దకు చేరుకొని చోరీకి యత్నించిన శశి కుమార్ ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం సంఘటన స్థలాన్ని ఎల్లారెడ్డి సిఐ రాజారెడ్డి, ఏటీఎం కేంద్రం వద్దకు చేరుకొని దొంగతనానికి యత్నించిన తీరుపై విచారణ చేపట్టారు. క్లూస్ టీం సభ్యులు వేలిముద్రల నమూనా లను సేకరించారు. కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# కార్మిక, కర్షక పోరాటాలతో కేంద్రం మెడలు వంచుదాం

## క్విట్ ఇండియా స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలి

## సీపీఎం ఎంఎల్ జిల్లా కార్యదర్శి పీ.రామకృష్ణ



కామారెడ్డి, బతుకమ్మ :కార్మిక, కర్షక పోరాటాలతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రజల హక్కులను సాధించుకోవాలని సీపీఐ(ఎంఎల్) కామారెడ్డి మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పీ. రామకృష్ణ, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్ పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని వారు కోరారు. దేశవ్యాప్తంగా ఎస్‌కేఎం, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన 'జైల్ భరో' కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి పట్టణంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఎదుట ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వదేశీ కార్పొరేట్ సంస్థలు, విదేశీ బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధానాలను అవలంబిస్తోందని వారు విమర్శించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో రైతులను నష్టపరిచే చర్యలకు పాల్పడుతోందని, వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ శక్తులను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విదేశీ వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ధరలకు దిగుమతి చేసుకోవడం వల్ల దేశీయ పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా విదేశీ బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని, దీంతో కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని వారు ఆరోపించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరుస్తూ కొత్త పేర్లతో పథకాలను తీసుకువచ్చి వ్యవసాయ కార్మికుల సంక్షేమం నుంచి కేంద్రం తప్పుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. విద్యుత్ రంగానికి సంబంధించి కొత్త చట్టాల ద్వారా ప్రజలు, రైతులపై అదనపు భారాలు మోపే ప్రయత్నం జరుగుతోందని వారు పేర్కొన్నారు. అలాగే అటవీ హక్కుల చట్టం--2006కు బదులుగా అటవీ పరిరక్షణ పేరుతో కొత్త చట్టాలను తీసుకువచ్చి పోడు భూములపై గిరిజనుల హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకు పోరాటాలను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ప్రజలు ఐక్యంగా ఉద్యమించి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. ప్రకాష్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి జీ. సురేష్, ఏఐయూకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పీ. పరమేష్, కార్యదర్శి ఆర్. దామోదర్, ఏఐపీకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి. కిశోర్, కోశాధికారి ఎస్. కిశోర్, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, దేవిదాస్, ప్రసాద్, బాలయ్య, మల్లన్న, గోపాల్, వెంకన్న, బలరాం, రాజు, సత్యం, రాజనర్సు, ముస్తాక్, టీయూసీఐ నాయకులు సాయిలు, రమేష్, శివరామరాజు, లింబవ్వ, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కొనుగోలుకు ఇక ఆన్‌లైన్ బుకింగ్ తప్పనిసరి

## వ్యవసాయ విస్తరణ అధికారి డి.పండరి



జుక్కల్, బతుకమ్మ :రైతులు ఇకపై యూరియాతో పాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను కూడా ఆన్‌లైన్ యాప్ ద్వారా ముందుగా బుకింగ్ చేసుకుని కొనుగోలు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి డి. పండరి సూచించారు. జుక్కల్ మండలంలోని మైబాపూర్ గ్రామంలో సోమవారం రైతులకు ఆన్‌లైన్ యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పండరి మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువుల బుకింగ్ కోసం ప్రత్యేక యాప్ విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. కామారెడ్డి జిల్లాలో ఈ విధానం సోమవారం నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపారు. ఎరువుల విక్రయాలు, నిల్వలు, రైతుల డిమాండ్, సరఫరాను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక డిజిటల్ వ్యవస్థను రూపొందించినట్లు ఆయన వివరించారు. రైతులు తమకు అవసరమైన ఎరువులను ఏ డీలర్ వద్ద కొనుగోలు చేయాలనుకుంటున్నారో యాప్‌లోనే ఎంపిక చేసుకుని బుకింగ్ పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పారు. బుకింగ్ చేసుకున్న తర్వాత దాని కాలపరిమితి రెండు రోజులు ఉంటుందని, ఈ వ్యవధిలో ఎంపిక చేసుకున్న డీలర్ వద్దకు వెళ్లి ఎరువులను కొనుగోలు చేయాలని పండరి సూచించారు. రైతులు ఈ కొత్త విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఎరువుల కొనుగోలుకు ముందుగానే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

# అక్రమ మద్యం, మాదకద్రవ్యాలపై ఆబ్కారీ శాఖ నిఘా

## మద్నూర్ మండల వ్యాప్తంగా విస్తృత తనిఖీలు



జుక్కల్, బతుకమ్మ :అక్రమ మద్యం విక్రయాలు, మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఆబ్కారీ శాఖ అధికారులు మద్నూర్ మండల వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఆబ్కారీ అధికారి (ఈఎస్) ముకుంద రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు మద్నూర్ ఆబ్కారీ ఎస్ఐ నాగేష్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని కల్లు దుకాణాలు, దాబా హోటళ్లు, రైస్ మిల్లుల గోదాముల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. కల్లు దుకాణాల్లో కల్లు నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపినట్లు ఎస్ఐ వెల్లడించారు. దాబా హోటళ్లలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నారా అనే అంశంపై అధికారులు ఆరా తీశారు. అలాగే రైస్ మిల్లుల గోదాములను తనిఖీ చేసి మాదకద్రవ్యాలకు సంబంధించిన వస్తువులు లేదా ఇతర అనుమానాస్పద పదార్థాలను నిల్వ చేశారా అనే విషయాన్ని పరిశీలించారు. మహారాష్ట్ర – తెలంగాణ సరిహద్దులోని ఆబ్కారీ చెక్‌పోస్ట్ వద్ద తెలంగాణలోకి ప్రవేశించే ఇతర రాష్ట్రాల వాహనాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అక్రమ మద్యం, మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎస్ఐ నాగేష్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆబ్కారీ సిబ్బంది దేవిసింగ్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల గొంతుకగా అన్నాభావు సాటే

## అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :పేదల గొంతుకగా అన్న బాబు సాటే నిలిచారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త తెలిపారు. నగరంలోని చంద్రశేఖర్ నగర్ కాలనీ చౌరస్తాలో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాతంగ్ సమాజంలో పుట్టిన అన్నాభావు చిన్నప్పటి నుంచి కుల వివక్షను ఎదుర్కొన్నారన్నారు. మిల్లులో పనిచేస్తూ వీధి దీపాల కింద కూర్చొని చదివి గొప్ప రచయిత కవిగా ఎదిగారని గుర్తు చేశారు. సుమారు 35 పుస్తకాలను రాసి ఆదర్శంగా నిలిచారన్నారు. కేవలం రచనలు చేయడమే కాకుండా మహారాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. జై భీమ్ జై భారత్ అనే నినాదంతో అంబేద్కర్ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. ప్రధానంగా చదువు ఒక్కటే ఆయుధమని కులం పేరుతో ఎవరిని చిన్నచూపు చూడొద్దు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చు అని సందేశాన్ని ఇచ్చారన్నారు. నిజామాబాద్ అర్బన్ లో ఉన్న అన్నాభావు సాట సమాజానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, బంటు ప్రీతి ప్రవీణ్, అన్నా భావు సాథే సమాజ్ కమిటీ అధ్యక్షుడు గంగాధర్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల జ్ఞాపకాలను ఎప్పటికీ మరచిపోలేం

### పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్ల మంజూరు

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ





కామారెడ్డి, బతుకమ్మ :జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తనను తీర్చిదిద్దిన పాఠశాల జ్ఞాపకాలను ఎప్పటికీ మరచిపోలేమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ నిరూపించారు. తాను విద్యనభ్యసించిన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించిన ఆయన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. పాత భవనాన్ని కూల్చి ఆధునిక వసతులతో నూతన పాఠశాలగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ఆయన పాఠశాలను సందర్శించారు. తాను చదువుకున్న తరగతి గదిలో కొద్దిసేపు కూర్చొని చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్నారు. తాను అడుగులు వేసిన ప్రాంగణం, విద్యాబుద్ధులు నేర్చుకున్న తరగతి గదులు, తనతో కలిసి చదువుకున్న స్నేహితుల జ్ఞాపకాలు ఆయన కళ్లముందు మెదిలాయి. ఆ సమయంలో ఆయన ముఖంలో కనిపించిన భావోద్వేగం అక్కడున్న పూర్వ విద్యార్థులను సైతం కదిలించింది. తాను చదువుకున్న పాఠశాల తన జీవితానికి పునాది వేసిన ప్రదేశమని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. ఈ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలనే ఆలోచన ఎప్పటి నుంచో తనలో ఉందన్నారు. నేను చదువుకున్న బడి ఇది. ఈ పాఠశాల నాకు కేవలం ఒక విద్యాలయం కాదు.. నా జీవితానికి పునాది వేసిన ప్రదేశం. ఇక్కడి నుంచే నా ప్రయాణం ప్రారంభమైంది. అందుకే ఈ బడికి ఏదో ఒక మంచి చేయాలనే తపన ఎప్పటికీ ఉంటుందని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు. 1971లో తాను విద్యనభ్యసించిన ఈ పాఠశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనతో కలిసి చదువుకున్న మిత్రులను ఏళ్ల తర్వాత అదే పాఠశాల ప్రాంగణంలో కలుసుకోవడం మరపురాని అనుభూతిగా అభివర్ణించారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన షబ్బీర్ అలీ.. పాఠశాల అవసరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. పాఠశాల భవన అభివృద్ధితో పాటు విద్యార్థులకు ఆధునిక విద్యా ప్రమాణాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. అత్యాధునిక ల్యాబొరేటరీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులు, ఇతర ఆధునిక విద్యా సదుపాయాలతో పాఠశాలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన చోట తన సొంతంగా కూడా ఖర్చు చేస్తూ సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో పూర్వ విద్యార్థులతో షబ్బీర్ అలీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తనతో కలిసి చదువుకున్న మిత్రులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి అనుభవాలు, పాఠశాలలో గడిపిన రోజులు, అప్పటి ఉపాధ్యాయులు, స్నేహితులతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులతో ఆయన సరదాగా ముచ్చటించారు. ఏళ్ల తర్వాత పాత మిత్రులంతా ఒకే చోట కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణం ఆత్మీయత, ఆనందం, జ్ఞాపకాలతో సందడిగా మారింది. బాల్య జ్ఞాపకాలకు సాక్ష్యంగా నిలిచిన పాత భవనం త్వరలో కొత్త రూపు సంతరించుకోనుండటంపై ఒకవైపు ఆనందంగా ఉన్నప్పటికీ, ఆ భవనాన్ని వీడాల్సి రావడం కొంత భావోద్వేగానికి గురిచేసిందని షబ్బీర్ అలీ తెలిపారు. భవనం మారుతుంది.. కానీ ఈ బడి నాకు ఇచ్చిన జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ మారవని ఆయన పేర్కొన్నారు. ఆయన మాటలు అక్కడున్న పూర్వ విద్యార్థులను సైతం భావోద్వేగానికి గురిచేశాయి. తాను చదువుకున్న పాఠశాలను మరచిపోకుండా, అదే విద్యాలయ అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు తీసుకురావడంతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్న షబ్బీర్ అలీపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. చదువు నేర్పిన బడికి రుణం తీర్చుకోవాలనే ఆలోచనతో, అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కైలా శ్రీనివాస్, మహమ్మద్ ఇలియాస్, పండ్ల రాజు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఆధార్ కార్డులతో తిరుమలలో గదుల దందా..

### భక్తులకు అధిక ధరలకు గదుల విక్రయం

### ఆరుగురు అరెస్ట్



వెబ్ డెస్క్, బతుకమ్మ :నకిలీ ఆధార్ కార్డులను ఉపయోగించి తిరుమలలో తక్కువ ధరలకు గదులు పొంది, వాటిని అధిక ధరలకు భక్తులకు విక్రయిస్తున్న దళారీ ముఠాను తిరుమల పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో తెలంగాణ, బిహార్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. తెలంగాణకు చెందిన ఇరప్ప కాలప్ప, శ్రీనివాస్, బిహార్‌కు చెందిన అముల్ కుమార్ సింగ్, కర్ణాటకకు చెందిన ప్రకాష్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సందీప్, విష్ణువర్ధన్ కలిసి ముఠాగా ఏర్పడి నకిలీ ఆధార్ కార్డులను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఇతరుల ఆధార్ కార్డుల్లో ఫొటోలు, పేర్లు, నంబర్లను మార్చి వాటిని గదుల బుకింగ్‌కు ఉపయోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తిరుమలలో సామాన్య భక్తులకు గదులు కేటాయించే సీఆర్వో కార్యాలయంలో రూ.50, రూ.100, రూ.1,000 అద్దెతో లభించే గదులను నకిలీ ఆధార్ కార్డుల ద్వారా తీసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం గదుల కోసం ఎదురుచూస్తున్న భక్తులకు వాటిని అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నట్లు వెల్లడైంది. ఈ గదుల దందాను నిర్వహించేందుకు తిరుమలలోని హోటళ్లలో పనిచేసే కార్మికులు, వీధుల్లో వ్యాపారం చేసే హాకర్లను కూడా ముఠా ఉపయోగించుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. కార్మికులు, హాకర్లను సీఆర్వో కార్యాలయంలోని క్యూలో నిలబెట్టి గది అద్దెను ముఠా సభ్యులే చెల్లించేవారు. గది తీసుకున్న అనంతరం వారికి రూ.200 నుంచి రూ.500 వరకు కమీషన్ చెల్లించి గది తాళాలు తీసుకునేవారు. ఆ గదులను అవసరం ఉన్న భక్తులకు 12 గంటల కాలానికి రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు విక్రయించేవారని పోలీసులు తెలిపారు. 12 గంటల సమయం పూర్తయిన తర్వాత అదే గదిని మరో భక్తుడికి కేటాయిస్తూ రొటేషన్ పద్ధతిలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ వ్యవహారంపై నిఘా పెట్టిన తిరుమల టూటౌన్ పోలీసులు శనివారం ఉదయం సీఆర్వో కార్యాలయం వద్ద ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. గదుల అక్రమ విక్రయానికి సంబంధించి మరింత మందికి ప్రమేయం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పోలీసుల హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలి

### మిడ్ మానేర్ బ్యాక్ వాటర్‌కు వచ్చే పర్యాటకుల భద్రతకు చర్యలు

### జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



రాజన్న సిరిసిల్ల, బతుకమ్మ : మిడ్ మానేర్ బ్యాక్ వాటర్ పర్యాటకులు పోలీసుల సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లి గ్రామ శివారులోని మిడ్ మానేర్ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ సోమవారం పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాక్ వాటర్ ప్రాంతంలో పర్యాటకుల భద్రత కోసం చేపడుతున్న చర్యలను ఎస్పీ పరిశీలించారు. పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బ్యాక్ వాటర్ పరిసరాల్లోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, పర్యాటకులు ఆయా ప్రాంతాల్లోకి వెళ్లకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, కుటుంబాలతో వచ్చే పర్యాటకుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నీటి ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. సరదా విషాదంగా మారకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

### బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగారెడ్డి



బాన్సువాడ, బతుకమ్మ :ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగారెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బాన్సువాడ పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంపై సోమవారం జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యతను చాటిచెప్పాలని కోరారు. విద్యార్థులు, యువతలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు 'హర్ ఘర్ తిరంగా' వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన దేశం.. మన జెండా.. మన గర్వం.. అనే నినాదంతో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని గంగారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శివప్రసాద్, జిల్లా ధార్మిక సెల్ జాయింట్ కన్వీనర్ కులకర్ణి శ్రీనివాస్‌రావు, బీజేపీ నాయకులు పాశం భాస్కర్‌రెడ్డి, గోస్కె పురుషోత్తం, హెచ్. లక్ష్మణ్, ప్రదీప్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15 లోగా దరఖాస్తు చేసుకోవాలి

### బాన్సువాడ ఎంపీడీవో ఆనంద్



బాన్సువాడ, బతుకమ్మ :పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్న వారు ఆగస్టు 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని బాన్సువాడ ఎంపీడీవో ఆనంద్ అన్నారు. అర్హులైన లబ్ధిదారులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, అర్హులు తమ దరఖాస్తులను సంబంధిత పంచాయతీ కార్యదర్శికి లేదా మండల కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు. అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, గడువు ముగిసిన అనంతరం దరఖాస్తుల స్వీకరణపై స్పష్టత లేకపోవడంతో అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మెండోరా, బతుకమ్మ :రోడ్డు ప్రమాదంలో దేవాయ్ అనే మహిళ మరణించినట్లు మెండోరా ఎస్సై సుహాసిని తెలిపారు. ఎస్సై తెలిపిన వివ రాల ప్రకారం సోమవారం మధ్యాహ్న సమయం లో ముప్కాల్ నుండి మెండోరా వస్తున్న ప్యాసింజర్ ఆటో డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపటం వల్ల ఆటో బోల్తా పడింది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న కోడిచర్ల గ్రామానికి చెందిన వేల్పూరు దేవాయ్ అనే మహిళ ఘటన స్థలంలో మృతి చెందినట్లు పేర్కొన్నారు. మిగతా వారికి గాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ ముప్కాల్ గ్రా మానికి చెం దిన సాయి కుమార్, మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ని మిత్తం కేసు నమోదు చేసినట్లు మెండోరా ఎస్సై సుహాసిని తెలియజేశారు.

## ఎల్లయ్య చెరువు పూడికతీతతో పెరిగిన భూగర్భ జలాలు

### టీచర్స్ కాలనీ వాసుల హర్షం



బాన్సువాడ, బతుకమ్మ :ఎన్నో దశాబ్దాలుగా పూడిక పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయిన ఎల్లయ్య చెరువు ఇటీవల చేపట్టిన పూడికతీత పనులతో జలసిరితో కళకళలాడుతోంది. చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు మెరుగుపడుతున్న నేపథ్యంలో టీచర్స్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 75 ఏళ్లుగా పూడికతీతకు నోచుకోని ఎల్లయ్య చెరువులో పూడికతీత పనులు చేపట్టడం వల్ల చెరువుకు కొత్త రూపు వచ్చిందని స్థానికులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ తీసుకున్న నిర్ణయంతో చెరువు అభివృద్ధి సాధ్యమైందని వారు తెలిపారు. చెరువు పూడికతీత పనులు పూర్తవ డంతో వర్షపు నీటిని అధికంగా నిల్వ చేసుకునే అవకాశం ఏర్పడిం దని, తద్వారా భూగర్భ జలాలు మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే టీచర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో బావులు, బోర్ల లో నీటి లభ్యత మెరుగుపడు తున్నట్లు చెబుతున్నారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల రైతులు, పశువులు, పరిసర ప్రాంతాల ప్రజ లకు దీర్ఘకాలిక ప్రయో జనం చేకూరుతుందని స్థానికులు పేర్కొన్నారు. నీటి సంరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ పనులు దోహదపడతాయని తెలిపారు. పూడికతీత పనుల సమయంలో కొందరు అనవసర వివాదాలు, అపోహలు సృష్టించేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రజాహితమే లక్ష్యంగా పనులు పూర్తిచేయడం అభినందనీయమని స్థాని కులు అన్నారు. చెరువు బాగుంటే గ్రామం బాగుంటుంది అనే నానుడికి ఎల్లయ్య చెరువు నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొంటూ, చెరువు అభివృద్ధికి కృషి చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాసుల బాలరాజ్, స్థానిక కౌన్సిలర్ మహమ్మద్ ఖాలెక్ కు స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

### చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య




నిజామాబాద్ రూరల్, బతుకమ్మ : సారంగాపూర్ ఎన్ సిఎస్ఎఫ్ చక్కెర ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13వ తేదీ గురువారం ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించనున్న రైతు సమ్మేళనాన్ని రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య పిలుపునిచ్చారు. సోమవారం సాయినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాపయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులను ఆరుతడి పంటల వైపు ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో చెరుకు కూడా ఆరుతడి పంటేనని పేర్కొన్నారు. సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తామని ప్రభుత్వం రైతులకు భరోసా కల్పిస్తే, రైతులంతా చెరుకు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గతంలో సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ పరిధిలోని 117 గ్రామాల రైతులకు చెరుకు సాగు చేసిన అనుభవం ఉందని చెప్పారు. ప్రస్తుతం రెండో పంటగా చెరుకు సాగు చేసేందుకు సుమారు 40 గ్రామాల రైతులు ముందుకు వస్తున్నారని తెలిపారు. దేశంలో బెల్లానికి మంచి డిమాండ్ ఉన్నందున సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని బెల్లం ఉత్పత్తి కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నిర్వహించాలని పాపయ్య డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు చక్కెర ఫ్యాక్టరీలను పునఃప్రారంభిస్తామని హామీలు ఇచ్చి రైతులను మోసం చేశాయని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా గత ప్రభుత్వాల బాటలో నడవకుండా రైతులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని కోరారు. ఫ్యాక్టరీ పునఃప్రారంభం కోసం రైతులంతా ఐక్యంగా బలమైన రైతు ఉద్యమాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో 13న జరిగే రైతు సమ్మేళనంలో భవిష్యత్ కార్యాచరణ, బాధ్యతలపై తగిన ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ సమ్మేళనానికి రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పాపయ్య కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, సిర్పూర్ గంగారెడ్డి, కొట్టే గంగాధర్, టేక్మాల్ లక్ష్మణ్, తుంగపల్లి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన తీజ్ ఉత్సవాలు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : బంజారా సంప్రదాయాలకు అనుగుణంగా ఆషాఢ మాసంలో తొమ్మిది రోజుల పాటు జిల్లాలోని వివిధ తాండాల్లో నిర్వహించిన తీజ్ పండుగ ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా తీజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కమిటీ బాధ్యులు లక్ష్మణ్ నాయక్ మాట్లాడారు. తీజ్ పండుగను అంగరంగ వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా తీజ్ కమిటీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాల్లో పాల్గొని బంజారా సమాజ సంస్కృతి, సంప్రదాయాలకు మద్దతు తెలిపిన నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నగర మేయర్ ఉమారాణి, కార్పొరేటర్లు పంచరెడ్డి లలితాచరణ్, గంగాధర్, నాగోళ్ల లక్ష్మీనారాయణ తదితర ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వివిధ తాండాల నుంచి తరలివచ్చి తొమ్మిది రోజుల పాటు తీజ్ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేసిన అక్కాచెల్లెళ్లు, యువతులు, యువకులు, సమాజ పెద్దలు, తాండా నాయకులు, కారోబారులు, పూజారులు, తీజ్ కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే నిజామాబాద్ నగరంలో తీజ్ పండుగను ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు సహకరించిన నగర ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు శాఖతో పాటు ఇతర అధికార యంత్రాంగం, నాయకులు, తాండా పెద్దలు, యువతీ యువకులకు జిల్లా తీజ్ కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**బంజారా సంస్కృతిలో తీజ్‌కు ప్రత్యేక స్థానం**

తీజ్ పండుగ బంజారా సమాజానికి ఎంతో ప్రత్యేకమైన ఆచార, సంప్రదాయ పండుగ అని లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ పండుగలో ముఖ్యంగా పెళ్లికాని యువతులు తీజ్‌ను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ, తమ భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకోవడం బంజారా సంస్కృతిలో గొప్ప సంప్రదాయమని వివరిం చారు. బంజారా సంస్కృతి, సంప్ర దాయాలు, ఆచారాలు, పండుగల విశిష్టతను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా తీజ్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో తీజ్ కమిటీ సభ్యులు చంద్రు నాయక్, మాజీ కార్పొరేటర్ చాంగు బాయి, రమేష్ రాథోడ్, గంగారాం, సర్పంచ్ డా. లాల్‌సింగ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ప్రభుత్వ విప్



ఎల్లారెడ్డి, బతుకమ్మ :భవానిపేట్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మంద గోవిందా రెడ్డి మాతృమూర్తి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ నాయకులు గంప గోవర్ధన్ సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పల్వాంచ మండల అధ్యక్షులు బొంబోతుల రాజా గౌడ్, కుంభల రవి యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ రావు, శ్రీకాంత్ రెడ్డి, రాఘవేందర్ రావు, సర్పంచులు శ్రీనివాస్ గౌడ్, గ్యార సాయిలు, మండల నాయకులు పైడకుల రాములు, గంగా రెడ్డి, రమేష్ గౌడ్, రాజా నర్సు, బాల గౌడ్, నర్సింలు, యూత్ అధ్యక్షులు దేవరాజ్, ప్రశాంత్ రెడ్డి, ఆకు రాజం, నరేష్, రంజిత్, సాయి గౌడ్, శ్రీనివాస్ తదితర ఎల్లారెడ్డి మండల కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

### త్రివర్ణ పతాకాల పంపిణీ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని బస్ స్టాండ్ వద్ద త్రివర్ణ పతకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల పోరాట స్ఫూర్తితో దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు ప్రతి సంవత్సరం "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కేవలం స్వాతంత్ర దినోత్సవం ఒక్కరోజు జెండా ఎగురవేయడమే కాకుండా ఇంటిపై నిత్యం రెపరెపలాడాలన్నారు. అలాగే ఈ నెల 14న జరిగే తిరంగా ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతన్కర్ లక్ష్మీనారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.